“ నీ కాలివేళ్ళను మట్టెలున్నాయా ? ” అన్నాడు.

“ ఆ ” అంది పిల్లి.

“ అయితే నడిచి పోదాం ! లే ! మనవూరు ! నీ మట్టెల చప్పుడుకి పురుగు పుట్రా ఉంటే తప్పుకు పోతాయి. భయం లేదు. ” అన్నాడు నాగడు. ఇద్దరూ లేచి నడుస్తూయున్నారు. పిల్లవి, మట్టెలు చప్పుడు అవుతూయుంటే నాగడింకా అంటాడు “ ఇల్లాంటి చప్పుడేనే పొడుగూతా నే నీ పొద్దు గోదారి మీద వచ్చి ప్రాణం పోయీప్రాణంగా ఈత్తూవున్నంతసేపూ నేను విన్నాది. ఇలాంటి చప్పుడేనే నేను విన్నాది! ఈ మట్టిల చప్పుడేనే నీ మట్టిలుచప్పుడేనే ! ” అన్నాడు నాగడు. ఆలా అంటున్న నాగడికి ముందు నడుస్తూ పైయీనుకు జవాబుగా పిల్ల అంది. “ మఱీ పొద్దల్లా నీ కోసమై ఈ గట్టుమీద నడిచిం దెవరనుకుంటున్నావు ? నేనే ఈ మట్టిల్తో, మట్టెల్తో నే నే ! నే నే ! ” అంది.

## ప్యారీ పారవరౌంటు

హిందూ ముస్లిమ్ ఐకమత్యం రాజకీయంగా ఎంత కుదర కుండా పోతూవున్నా, సాంఘికంగా విజయవంతం గావడం తఱుచు చూస్తూవుంటాం, వింటూవుంటాం; ఒక్కొక్కప్పు డనుభవంలోకే వస్తూయుంటుంది. అటువంటి అనుభవం కలిగి నప్పు డనుకోకతప్పదు. “ హిందువులేమిటి ? మహమ్మదీయు లేమిటి ? సమస్తసృష్టి సర్వేశ్వరమయం, సర్వేశ్వర మాయ ” అని అనుకోక తప్పదు. మహోచిత్రం ! మనుష్యులెంత తప్పుకు

తప్పుకు తిరుగుతూవున్నా, కాలమనేది వొకటి తప్పనిసరిగా కొందరి కొందర్ని కలిపి చూపించడానిగ్గాను ఒకానొక అవకాశం కలిపిస్తుంది.

చూడండీ ! అప్పటప్పట బక్రీద్ పండగ, దసరా సరదా, ఒకేవారం కలిసిరావడం తటస్థిస్తుంది. ఏకాదశీ, రంజాన్ ఒకే రోజున సమేలంగా వస్తూయుంటాయి. ఎందుకు రావాలి అలా కూడిగ్గా ఆయా వినోదాలు, వేడుకలు? ఐకమత్యప్రభావం ఒకప్పుడు కాకపోతే ఒకప్పుడైనా ప్రపంచాని కెరుకపఱచడానికే. ఈ కాలప్రభావాన్ని పుచ్చుకుని కొన్ని కొన్ని యితర ఐకమత్యాలు కూడా చిల్లరమల్లరగా వికసించక మానవు. హిందూ యువకుడు గళ్ళలుంగీ వెయ్యడం, మౌలవీ ఎడంనుంచి కుడికి చూడ్డం, ఆ వెంకటేశ్వరప్రచారం పీర్లబాజాతో జరగడం, బీబీనాంచారీసాహేబా బురకాలోంచి కాకుండా బోడిస్‌లోంచే సిగ్గూ ప్రేమా వెలిగ్రక్కడం, మొహరమ్ వేషాలు, పగటి వేషాలు కలిసి మెలసి "వూయింగు" చేసికోవడం—ఈ తుది సంఘటనమే మన యీ కథకు మూలకందం, రసకంథ, కందాయఫలమూను.

పగటివేషాలన్నవాటికి యీ వుత్సవపురోజులవీ, ఆ వుత్సవపురోజులనీ లేవు. పాఠశాలల్లో కుఱ్ఱవాళ్లు వేసే ఫాన్సీడ్రెస్సు వేషాలకైనా సంవత్సరోత్సవాలనీ, జయంతులనీ కద్దుగాని యీ పగటివేషాల తంతుకు వోవారం, వర్జం, తిథి, నక్షత్రం, ఘటిక, గ్రహచారం అక్కర్లేదు ; ఎప్పుడు ఆకలివేస్తే అప్పుడే ఎదో వోవేషం వేసుకుని నాలుగువేళ్ళూ లోపలకు పోజూచుకోవడమే వాటి పరమావధి, పరిపాకమూను. మొహరమ్

పండక్కి వేషాలువేయడం కూడా ఆకలితీర్చుకోవడానిగాను వేసే వేషాలే. పెద్దపులి వేషం వేసినా, బండీ పెద్దపులివేషం వేసినా, ఎఱ్ఱచిందుగువేషం వేసినా, పచ్చచిందుగువేషం వేసినా, దొంగాడివేషం వేసినా. దొరగారివేషం వేసినా,—చిట్టచివర తేలి పోతుంది నిజభావం "అయ్యా! సెలవు! రూపాయకు తక్కువ కాకుండా దయచేయించాలి!" అన్నప్పుడు.

ఆదాకా అవి పగటివేషాలు, ఇవి మొహరమ్ వేషాలు, అవి వేదసాంప్రదాయపువి, ఇవి ఖురాన్ సాంప్రదాయపువి అనే భేదబుద్ధితో తిలకించే చూపర్లందఱికి "ఆకలి! ఆకలి!" అనే ఆక్రోశంతో ఆ వేషగాండ్రు ప్రార్థించేటప్పుడు సర్వసామాన్య సర్వేశ్వర తేజోవిగ్రహం ప్రతిబింబితం కాకపోతుందా? అయి తీరుతుంది. మత వైషమ్యం అన్నది మఱచిపోయి ఆ వేషాల కేసి తేరిపార చూచేరు. చెవులు దోరెట్టుకు వినేరు.

"టమ్కు టమా—టమ్కు టమా"
"లగాలగీ—చకాబికీ"
(ఈల—ఈలమీద ఈల)
(కఱ్ఱల చప్పుడు డబ్బాల చప్పుడు)
"సిద్ధికి బచ్చా—రమ్తుచెలో"
"టమ్కు టమా—టమ్కు టమా"

అని వోతట్టు మొహరమ్ వేషాల నృత్యగీతాలు బహు దూరం వినిపిస్తూ కనిపిస్తూ వుంటే ఇంకోతట్టు కాస్త అసుకుంటా పగటివేషాల ధోరణి, మునిపళ్లు నొక్కుకుంటూ మగవేషం, నడాన్ని సాహేబువేషం, నడుస్తూవుంది.—ఇలా—సోమయాజి:— "ఒసేవ్ సోమీ! ఎక్కడున్నావు?"

సోమిదేవి : "సోమీ సోమీ అనే పిలుపుకు విసుగూ విరామం లేదు గదా ! వీడినోరడ ! ఇదెంతంతు సాహేబుగారూ !

సాహేబు : "నీకీ నీ మొగుడ్కీ పడఖాపోతే తళక్ ప్రయోగించు."

సోమిదేవి : "అనేకసార్లు తడికప్రయోగించి చూశాను."

సాహేబు : తడిక్కాదు. తళక్."

సోమిదేవి :—

"నా తళుకు బెళుకులే చూడండయ్యా !
నా మెళుకువ చూపులె కానండయ్యా !
నన్నంటగబోకు సాహేబయ్యా !
నా మగని క్కోపం మిక్కుటమయ్యా !
తధిగిణతోం దధిగిణతోం,
సెంట్లూ పెట్టి అంట్లూ తోం !"—

పైగుంపూ క్రిందిగుంపూ వాళ్లవాళ్ల పెగ్గ పోకిళ్లు చూపించడంలో అంతకంత కన్యోన్యం దగ్గఅపడతారు.

—"మీదకు రాకు హూణమ్లేచ్ఛా ! అహం సోమ యాజిన్ !"

—"'ఐ యామ్' అల్లందొర్ని."

—"అది ?"

—"బెల్లంసాని."

—"సోమీ ! వీళ్ళను చూశావు ? అల్లందొరనీ బెల్లం సాన్నీ ?"

—"ఇప్పుడు నేను అల్లంపచ్చడి చేయలేను !"

—"మత్తేం పచ్చడి చేస్తావు ?"

—“ సాహేబ్ పచ్చడి ”

—“ క్యా సాహేబ్ పచ్చడి ? ” అని సాహేబు సోమి దేవమ్మయొక్క రెక్కపట్టుకొని మొదట బలవంతంగా లాక్కుపోయినట్టు అభినయించి అనతిదూరంలో చెట్టాపట్టా తగిలించి ఇద్దరూ కలిసి ఆడతారు.

“ మా తళుకు బెళుకులే చూడండయ్యా
మా మెళుకువచూపులె కానండయ్యా ”
అంటూ.

సోమయాజివేషం బెల్లంసాని వేషంతో కలిసి మెలిసి “ టమ్కుటమా ! ” అంటూ గెంతుతాడు.

బెల్లందొర తన నెత్తిమీద దొరటోపీ ఆలా ప్రేక్షక జనానికి చూపిస్తూ అందులోనుంచి ఓ రంగురంగుల జేబురుమాలు పైకితీసి, ఆ రుమా లూపుతూ “ ఆవ్ ! జల్దీ రా ! కమెలాంగ్ ! ప్యారీపారమౌంట్ ! ” అని అరుస్తాడు. ప్రేక్షకజనాన్ని వొత్తిగించుకుంటూ ఓ బీబీ బిబ్బోకవతివేషం తక్కుతూ తారుతూ తన కక్కుర్లేనట్టు అల్లందొరవేషగాణ్ణి ఆకర్షిస్తూ చేర తీసుకుంటుంది. వీళ్ళిద్దఱూ అక్కణ్ణుంచి,

“ టక్కర్ కా చక్కర్ ”
“ చక్కర్ కా టక్కర్ ”
“ షెక్కర్ కా ముక్కేర్ ”
“ ముక్కేర్ కా షెక్కర్ ”

అని తాండవించి పోతారు.

ప్రేక్షకజనం, హిందువులు తురుష్కులు, పాశ్చాత్యులు అందఱూ ఆ ఆరువేషాల గమ్మత్తు వూయింగూ గంటూ తమలో తాము ముఖముఖాలు చూచుకుంటారు. దివ్యజ్యోతి ? ఎక్కడ ?